

## తుమ్మల బాబ్జీ

కట్టిన బట్ట కట్టకుండా ఎప్పుడూ పైలా పచ్చీసుగా తిరిగే ఆనాటి లింగమూర్తి రూపాన్ని మననం చేసుకుంటూ రైలు దిగిన సుదర్శనం ప్లాట్‌ఫారంమీద మాసిన ముతక ఖద్దరు బట్టల్లో తన కోసమే ఎదురుచూస్తున్న చిన్ననాటి నేస్తాన్ని వెంటనే గుర్తుపట్టలేకపోయాడు. గుర్తుపట్టిన తర్వాత కళ్ళనీళ్ళ పర్యంతమైంది.

మనిషి కాస్త పొగి పల్చబడిన సుదర్శనంలో వయస్సు తెచ్చిన మార్పులు మినహాయిస్తే మనిషి అప్పుడూ ఇప్పుడూ ఒకేలా వున్నాడు. "ఏరా సుద, బాగున్నావా" అంటూ దిక్కులు చూస్తున్న సుదర్శనాన్ని ఆనందంగా ఆలింగనం చేసుకున్నాడు లింగమూర్తి.

సుదర్శనం చలించిపోయాడు ఆ ఆప్యాయతకి. "ఎన్నాళ్ళయ్యిందిరా నిన్ను చూసి" అతని గొంతు జీర పోయింది ఆ సమయంలో.

"పద నడుస్తూ మాట్లాడుకుందాం" అంటూ ముందుకునడిచాడు లింగమూర్తి. అతన్ని అనుసరిస్తూ స్టేషన్ పరిసరాల నొకసారి పరికించిచూసాడు సుదర్శనం.

ఆ రోజుల్లో చిన్న రేకులషెడ్డు వుండేది. అదే ఏస్సెమ్ రూమ్, అదే బుకింగ్ రూమ్ అదే వెయిటింగ్ రూమ్, టిక్కెట్లు ఇవ్వడం, వసూలు చెయ్యడం, బెల్ కొట్టడం అన్నీ స్టేషన్ మాస్టారే - ఇప్పుడు చాలా మార్పులు సంభవించివాయి. వేటికి వాటికే ప్రత్యేకమైన పెద్ద పెద్ద గదులు. అందమైన బొమ్మరిళ్ళ సముదాయంలా స్టేషన్ని ఆనుకొని రైల్వే క్వార్టర్స్. పాసింజర్లతోను, సిబ్బందితోను గడబిడగా హడావుడి పడుతూ ఇప్పుడు నిజంగా రైల్వే స్టేషన్లాగే వుంది.

చిన్నవాడు మొక్కలు ఎగ్గొట్టిన రోజులన్నీ సుదర్శనం, అతని మిత్రుల అజ్ఞాతవాసం ఇక్కడే. వాడు జాలర్ల కుర్రాళ్ళతో కలిసి చేపలుపట్టిన ఏటి మడుగులు కాని, దొంగచాటున బీడీలు కాలుస్తుంటే మరొకంటికి తెలియకుండా దట్టమైన తన గుబుర్లమధ్య ఆశ్రయమిచ్చిన తుమ్మల బీడుగాని ఇప్పుడు లేవక్కడ. నాగరికత మింగెయ్యగా మిగిలిన ఆనాటి స్మృతిచిహ్నాలు ఏమైనా వున్నాయి అంటే అవి ఇప్పుడు కనుచూపు దూరమైన పంటపొలాలే.

"ఊరు చాలా మారిపోయిందిరా."

"ఊరేమిటి, మనుషులు కూడా బాగా మారిపోయారు."

సాలెవీధికి అడ్డునడి నడుస్తున్నారు.

ఆ రోజుల్లో సాలీల పూరిపాకల స్థానంలో ఇప్పుడన్నీ పెంకుటిండ్లు, పెద్దపెద్ద భవంతులు- "దేశం చాలా అభివృద్ధి చెందిందిరా" అన్నాడు ఆ భవంతుల వైపు వింతగా చూస్తున్న సుదర్శనం.

నిర్వేదంగా నవ్వి ఊరుకున్నాడు లింగమూర్తి.

"ఏం నవ్వుతున్నావేం?"

"అనాడు చేనేత పనిలో ఘనత వహించి ఒక వెలుగు వెలిగినవాళ్ళెవ్వరూ ఈవేళ ఇక్కడ లేరురా. అథవా ఒకరూ, అరా ఎవరైనా వున్నా కొంత కొంపలుగల వాళ్ళు చాలా తక్కువ."

"అదేమిటి?" ఆశ్చర్యంగా చూసాడు.

"అభివృద్ధి చెందిన మిల్లు బట్టల వాడకం పెరిగి చేనేతపనివారి కడుపు కొట్టింది. పనికోసం కొందరు పట్టణాలకి వలసపోతే, పల్లె వొదలలేని మరికొంత మంది ఇక్కడే కూలీనాలీ చేసుకుంటూ బతుకుతున్నారు. అన్ని రంగాలలోను ఇలాగే జరుగుతుందిరా. ప్రతిభావంతులైన చేతిపనివారలందరూ చెల్లాచెదురైనారు. మన చిన్నతనంలో పెద్దఎత్తున మిర్చి ఎక్స్పోర్ట్ వ్యాపారం చేసిన మాధవరావు గుర్తున్నాడా?"

తల వూపాడు సుదర్శనం.

"మిర్చి వ్యాపారంలో కోటికి పడగ ఎత్తుతాననుకున్న అతను వ్యాపారపైకుంటపాళిలో పెద్ద పాముకోట పడి కిందకు దిగజారిపోతే ఆరోజుల్లో అతని సహకారంతో కిరాణావ్యాపారం ప్రారంభించిన బాలకృష్ణా బ్రదర్సు ఈవేళ కోట్లకు పడగలెత్తారు. ఇక రైతుల మాట సరేసరి. ఆ రోజుల్లో బీద రైతులనుకున్న పెద్దకాపులు ఈవేళ చాలా మంది ధనికుల్లా తయారయినారు. వ్యాపారవంతుల పుణ్యమా అని దళారులు ధనికులై ప్రకృతి వైపరీత్యాలకు బలియైన రైతాంగం భూములను వడ్డీల కింద స్వాధీనం చేసుకుని ఊరు ఏలుతున్నారు. ఇదిరా ఈ గ్రామం అభివృద్ధి. మనదేశం అభివృద్ధిని..."

అలా మాట్లాడుకుంటూనే మిత్రులు యిద్దరూ రాజుచెరువు దాటి మర్రిచెట్టు కిందకు చేరుకున్నారు.

ఊరుమారినా ఊరులో పుట్టి ఊరితో పెరిగి ఊరి పాతకథలు చెప్పడానికి మిగిలివున్నానంటూ మర్రిచెట్టు దిమ్మ దానిమీద రంగువెలిసిన నందిరాయి బొమ్మ అలాగే ఉన్నాయి. అక్కడకి చేరుకునేసరికి సుదర్శనం గుండె ఆనందంతో వేగంగా కొట్టుకుంది. తల్లి వొడిలో తలదాచుకున్న పసిపాపలా అనిర్వచనీయమయిన అనుభూతికి లోనయ్యాడు.

అతని చిన్నతనంలో ఈ చెట్టు కిందనే హైస్కూలుకి వెళ్ళే సహిదా బేగం కోసం గంటలకు గంటలు నిరీక్షించేవాడు. సహిదాబేగం ఇప్పుడు ఎక్కడుందో? ఏం చేస్తుందో? భర్త, పిల్లలు సంసారం ఊబిలో ఇప్పుడు తన గుర్తయినా వుండివుంటాడా?

"ఏమిత్రా ఆలోచిస్తున్నావు?" లింగమూర్తి మాటలతో మళ్ళీ ఈ లోకంలోకి వచ్చాడు.

"అబ్బే- ఏంలేదు పద" అంటూ ముందుకు కదిలాడు.

ఆ రోజుల్లో మెరకవీధి హోటళ్ళకి పల్లపువీధి పెద్దకాపులకి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. పల్లపువీధి గబ్బిలాయిలు అంటూ వాళ్ళు హేళన చేస్తే చెట్టుకింద పక్షులు అంటూ వీళ్ళు ఈసడించేవారు

"పల్లపువీధి మెరకవీధి వైషమ్యాలు ఇంకా అలాగే వున్నాయా?"

"యింకేం వైషమ్యాలురా! ఆనాటి పగలు పట్టుదలలూ లేవు- మూర్తీభవించిన అమాయకత్వంతో, అజ్ఞానంతో విర్రవీగిన ఆనాటి పెద్దల బ్రతుకులు కాలం కరకుచక్రాల కింద నలిగిపోగా, కొత్తగా పుట్టుకొచ్చిన వ్యాపారవర్గం కోట్లుఅవి, చట్టాలవి ఆయుధాలుగా చేసుకుని రాజకీయ చదరంగం ఆడుతుంది. ఈ ఆటలో ఎవరి పరిధి వాళ్ళదే. ఎవరి బలం వారిదే."

ఊరుని స్కూలుని వేరుచేసే ఏలేరు

కాల్వని కలిపే వంతెన దాటేసరికి దూరంనుంచి అలంకరించిన ఎలక్ట్రికల్ దీపాల మధ్య దేదీప్యమానంగా వెలుగుతూ కనిపిస్తుంది హైస్కూలు.

హైస్కూలు సమీపించేవరకు కూడా సుదర్శనం కళ్ళు వెదుకుతూనే ఉన్నాయి అనాటి మిత్రులెవరయినా కనిపిస్తారేమోనని. కానీ ఎవరూ కనిపించలేదు.

"ఏదో. కుర్రాళ్ళు సర్దాగా విందుచేసుకోడానికి నాటకాలు వేసుకోడానికి ఏడాదికోమారు వార్షికంగా. చేస్తున్నారే తప్ప సంసార ఊబిలో కొట్టుకుపోతున్న మన బోటివాళ్ళకు తీరికెక్కడుంటుందిరా! రేపు ఇళ్ళకెళ్ళి కలుసుకుందాంలే" అన్నాడు లింగమూర్తి.

ఆడిటోరియం కొత్తతరం, పాత విద్యార్థులతో క్రిక్కిరిసి వుంది. లింగమూర్తి, సుదర్శనం వరసలో ఒకమూల వొదిగి కూర్చున్నారు.

"డాక్టరు జగన్నాథంగారు- వేదికను అలంకరించవలసిందిగా కోరుతున్నాం" అంటూ వేదికమీద మైకు ముందుకు వచ్చాడు ఒక యువకుడు. ఆ యువకుడి ఆహ్వానాన్ని పురస్కరించుకుని డాక్టర్ జగన్నాథం, ప్రొఫెసర్ ఆచారి, ప్రముఖ పారిశ్రామికవేత్త జంబులింగం, అభ్యుదయ రచయిత వెంకటప్పయ్య ఒక్కొక్కరే వేదిక ఎక్కారు. వాళ్ళను చూస్తుంటే చాలా ఆశ్చర్యమనిపించింది సుదర్శనానికి.

"ఒరేయ్ వీళ్ళు గుర్తున్నారా! ఎస్సెస్సెల్సీలో విశాలాక్షి జడపట్టుకు లాగేడని ఆచారిగారిని మూడేళ్ళు డిబార్ చేశారు. జంబులింగంగారు ఎనిమిదో తరగతిలో మూడేళ్ళు తప్పి, స్కూలు మానేశారు. వెంకటప్పయ్యగారు సైన్సు మాష్టారి భార్యకు లవ్ లెటర్ రాసి మెత్తగా తన్నులు తిన్నాడు."

లింగమూర్తి మాటలకు "ఏమిటోయ్ ఆ గొణుగుడు. కాస్త మాట్లాడకుండా కూర్చుంటారా" అని ఒక అబ్బాయి.

"మన ఊరు మరీ ఛండాలంరా. వీధి నాటకాలు అనుకుంటారో ఏమో! ప్రతిదానికి ఈ ముసలాళ్ళు తయారు" అంటూ మరో అబ్బాయి, వెనకాల వరసలో పాతవిద్యార్థి వాలంటీర్ల కామెంటుకు కించిత్ బాధపడినా ఆ బాధ పైకి కనపడనీయకుండా, వేదికమీద వ్యక్తుల ఉపన్యాసాలు వింటున్నట్లు కూర్చున్నారు ఆ మిత్రులిద్దరూ. కానీ, వారి అంతరంగంలో ఏవో కదలికలు. ఒకనాడు ఇదే స్కూలులో, ఇదే ప్రదేశంలో వలపు కన్నెల హృదయాలను లాలింపజేస్తూ హీరోలుగా, మేధావులుగా కాలర్లెగరేసుకు తిరిగిన జ్ఞాపకాలు ముప్పిరిగొంటున్నాయి వారి మస్తిష్కంలో.

వేదిక నలంకరించిన పెద్దలు స్నేహం గొప్పతనం గురించి, పూర్వ విద్యార్థి సంఘవార్షికోత్సవాల అవశ్యకత

గురించి అత్యద్భుతంగా మాట్లాడి వేదిక దిగారు

ఆ మిత్రులను కలుసుకోవడానికి జనాన్ని తప్పించుకుంటూ మెయిన్ గేటు దగ్గరకి పరిగెత్తుకుని వెళ్ళారు సుదర్శనం, లింగమూర్తీ. కానీ, అప్పటికే జగన్నాథం, ఆచారి, జంబులింగం ఎక్కిన చిన్న కారు కదిలి కనుమరుగై పోయింది.

సుదర్శనానికి మనస్సు చివుక్కుమంది. చిన్ననాటి మిత్రుల నొకసారి చూసిపోదామని ఎన్నో మైళ్ళ దూరం నుండి వచ్చాడు.

సుదర్శనం కళ్ళల్లో అసంతృప్తి చూసి చాలా బాధపడ్డాడు లింగమూర్తి. "జంబులింగంగాడు వాళ్ళ ఇంటి దగ్గర వీళ్ళకు దిన్నరు ఏర్పాటు చేసినట్లున్నాడు. ఉదయాన్నే కలుసుకుందాంలే" అన్నాడు.

"ఎప్పుడో ఇరవై ఏళ్ళ క్రితం ఈ ఊరొదిలిపోయాము. ఇక శేషోమాశో ఈ ప్రపంచాన్నే వదిలిపోవలసిన సమయమాసన్నమవుతుంది. జీవితంలో చివరిసారిగా ఒక్కమారు ఆనాటి మిత్రులందరిని చూసిపోదామని వచ్చాను. అందర్నీ కాకపోయినా కొందర్నయినా చూడగలిగాము. ఇది చాలురా."

"పద అలా గ్రౌండులోకి వెళ్ళి కూర్చుందాం" అంటూ లింగమూర్తి గ్రౌండువైపు నడిచాడు.

గ్రౌండులో పచ్చిక బయళ్ళమీద పల్చటి వెండి జలతారు చీర ఆరేసినట్లుంది వెన్నెల. మూక్కాలా గ్రౌండుని ఒరుసుకుంటూ ప్రవహిస్తున్న ఏటిహోరు వయస్సులో కొడుకుని పోగొట్టుకున్న వృద్ధమాత రోదనలా హృదయ విదారకంగా వుంది. విశాలమైన గ్రౌండులో గాలికి తలఊపుతున్న పిశాచాల్లా వున్నాయి తాటిచెట్లు.

పచ్చిక బయలుమీద కూర్చుని తాటి చెట్టుకి జారగిలబడ్డాడు లింగమూర్తి. అతనికి సమీపంలో కూర్చుని రెండు చేతులమీద శరీరాన్ని వెనక్కి వాల్చి ఆకాశంలోకి చూస్తూ ఆలోచనలో పడ్డాడు సుదర్శనం.

జీవితం ఎంత విచిత్రమైనది! లోక మాలిన్యమంటని వయస్సులో స్వచ్ఛమైన హృదయంతో ఆలనాడు ఈ గడ్డి మీద తిరుగాడిన తనకు జీవితంపట్లఎన్ని కలలు! ఎన్ని ఆశలు! ఆశయాలు ఆకాశపు అంచులను చేరుకుని శిఖరాగ్రంపై నున్న తనను ఈ లోకంచేత 'మహాత్మా' అనిపించాలని, తన ప్రాణంలో ప్రాణంగా తన కలలకు రూపంలాంటి వహీదాతో జీవితాన్ని పంచుకోవాలని ఎంత తపన పడ్డాడు! ఎంత తపస్సు చేశాడు! కులాలు, మతాలు, వర్గాలు, విభేధాలు ఎంత బలీయమైనవో తెలియని వయస్సు! ఎన్ని అగాధాలు, ఎన్ని గోడలు, ఎన్ని తలుపులు, ఎన్ని గొళ్ళాలు, జీవితం పొడుగునా! వాటిని అధిగమించలేక

తలల మైదానాలు కల్లలై పోగా కపట లోకపు సంపద అగాధాల అంచులనుండి దొర్లి సంసారం, సంపాదన, లోక ధర్మపు రొంపిలో కూరుకుపోయి. ఎన్నో ఏళ్ళ తర్వాత ఇప్పుడొక్కసారి మెడలు బయటకు చాచి తొంగిచూస్తే- ఏవి ఆ విలువలు? ఏమైపోయారు అలనాటి నేస్తాలు?

ఎర్రసుబ్బడు, వెంకటలక్ష్మి, శ్రీనివాసులు, శాస్త్రిగారు, సోమయాజులు, దళపతి, సుబ్రహ్మణ్యం, మందాకిని, మయూరి, ఏమైపోయారు వీళ్ళంతా?

"ఎర్రసుబ్బడు ఏంచేస్తున్నాడ్రా?"

"ఇంకెక్కడి ఎర్రసుబ్బడురా? వెంకటలక్ష్మి ఎర్రసుబ్బడు ప్రేమించుకున్న సంగతి నీకు తెలుసు కదా! నువ్వీ ఊరు వదిలిపోయిన తర్వాత మరుసటి సంవత్సరం వాళ్ళ పెళ్ళయిపోతుందనే అనుకున్నాం. ముహూర్తాలు కూడా పెట్టేశారు. కానీ, దురదృష్టం- ఆ సంవత్సరమే ఎర్రసుబ్బడు నాన్న ఉల్లిపాయల వ్యాపారంలో దివాళాతీసి వున్న ఇల్లు కూడా పోగొట్టుకున్నాడు. దాంతో వెంకటలక్ష్మి నాన్న వెంకటలక్ష్మికి వేరే సంబంధం కుదిర్చాడు. వెంకటలక్ష్మి పెళ్ళి రేపనగా ఆవేళ రాత్రి ఎర్రసుబ్బడు రైలు కింద తల పెట్టాడు. ఆ తెల్లవారు ఝామున వెంకటలక్ష్మి శవం వాళ్ళ నూతిలో తేలింది. అదో పెద్ద ట్రాజెడీరా" చెప్పటం ఆపి చేతిరుమాలుతో కళ్ళు తుడుచుకున్నాడు లింగమూర్తి.

సుదర్శనం మనసు వికలమైంది. చాలా సేపటివరకు ఏం మాట్లాడలేక పోయాడు. కాసేపటికి తేరుకుని "దళపతి ఎక్కడుంటున్నాడు?" అని అడిగాడు.


"ఈ వూరుని మింగేస్తున్న ధనిక దళారులకి వ్యతిరేకంగా తిరుగుబాటు జెండా ఎగురవేశాడు. కూలి సంఘాలు, రైతు సంఘాలు నిర్మించి వాళ్ళకి కంటక ప్రాయమయినాడు. దోపిడి శక్తులన్నీ కట్టగలిసి ఎమర్జెన్సీలో వీణ్ణి జెయిల్లోకి తోయించారు. జెయిల్లోనే కన్ను మూశాడు. హార్టు ఫెయిలందని పోలీసులు అంటారు. పోలీసులే చంపేసారని ప్రజల అనుమానం!

సుదర్శనం విడిచిన నిట్టూర్పు ఏటి హోరు శబ్దంలో వినిపించలేదు లింగమూర్తికి.

ఇక మిగిలి మిత్రుల ఆచూకి అడగడానికి భయపడ్డాడు సుదర్శనం, ఎటువంటి దుర్వార్తలు వినవలసివస్తుందోనని.

మరికొన్ని క్షణాలలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభించబడతాయని ఆడిటోరియంలోంచి మైకు అనౌన్స్‌మెంటు విని లేచి నిలబడ్డాడు లింగమూర్తి "నాటకం చూద్దామా" అని.

"మిత్రుల జీవితాలు చూసిన తర్వాత ఇక నాటకం ఏం చూడగలంరా! పద ఇంటికి పోదాం."



• • •

ఆ తెల్లవారుజామునే లేచి తిరుగు ప్రయాణానికి సిద్ధమైనాడు సుదర్శనం; వుండమని లింగమూర్తి. ఎంత బ్రతిమలాడినా వినకుండా – వెళ్ళిపోతూ వెళ్ళిపోతూ లింగమూర్తితో అన్నాడు.

"ఒరేయ్ లింగా! మనం పదవ తరగతి చదివేటప్పుడు జీవితం గురించి మాట్లాడమని స్కూలు యానివర్సరీకి వక్తృత్వపు పోటీ పెట్టారు గుర్తుందా."

గుర్తుందన్నట్లు తలవూపాడు లింగమూర్తి.

"జీవితం మైనపు ముద్దలాంటిదని, అందమయిన రీతిలో మనకు కావలసిన విధంగా దాన్ని మలచుకొనే శక్తి మన చేతుల్లోనే వుందని నేనన్నాను. నువ్వు నా అభిప్రాయంతో విభేదించావు. జీవితంలో ఎంతో పైకి వస్తారనుకున్నవాళ్ళు ఎందుకూ కొరగాకుండా పోవడం, ఎందుకూ కొరగానివాళ్ళనుకున్నవాళ్ళు ఎంతో వున్నత స్థితికి చేరుకోవడం మనం చూస్తూనే వున్నాం. తనకు కావలసిన విధంగా జీవితాన్ని మలచుకునే శక్తి మనిషికే వుంటే ఏ మనిషి జీవితం కూడా విషాదం కాదు. చాపకింద నీరులా పైకి కనిపించకుండా జీవితాన్ని సమాజాన్ని కూడా శాసించి నడిపిస్తున్న శక్తులు వేరే వున్నాయి. వాటి గురించి పూర్తిగా తెలుసుకోకుండా జీవితాన్ని నిర్వచించడం తప్పే అవుతుంది' అని

మన్ను వాదించావు. కానీ ప్రైజు నాకే వచ్చింది. అవేళ వాదనలో నిజంగా నెగ్గింది నువ్వేనని నా కిప్పు డర్థమవుతుందిరా!"

ఇంకా పూర్తిగా తెల్లవారని ఆ మసక వెలుతురులో మిత్రుడి కళ్లల్లో తడి చూడలేక మౌనంగా తల దించుకున్నాడు లింగమూర్తి.

ఇరవై ఏళ్ళపాటు గుండెల్లో ఎంతో భద్రంగా దాచుకున్న అలనాటి అందమైన రంగుల స్మృతి చిత్రంమీద వికృతమైన యదార్థాల మసిపూసుకొని భారమైన గుండెలతో స్టేషన్‌కి చేరుకునేసరికి రైలు సిద్ధంగా వుంది. టికెట్ తీసుకుని ఖాళీగా వున్న బోగీలో కిటికీ పక్కన కూర్చున్నాడు సుదర్శనం.

ఆలోచనల్లో వున్న సుదర్శనం విండో ఊచల్లోంచి విసురుగా మీదకు వచ్చిన వేళ్లు మొదలంటా తినేసిన మొండిచెయ్యిని చూసి ఉలిక్కిపడ్డాడు.

"బాబూ! ధర్మం."

ఎప్పుడో ఎక్కడో విన్న గొంతు.

యథాలాపంగా విండోలోంచి బయటకు తొంగిచూసాడు

కిటికీ బయట ఆకారం సుదర్శనాన్ని పరిశీలనగా చూసి ఏదో తప్పుచేసినట్లు గిరుక్కున వెనక్కితిరిగి పారిపోతూంటే అప్పుడు గుర్తుకొచ్చింది సుదర్శనానికి ఆ గొంతు ఎవరిదో.

తను చిన్నవాడు స్కూలు ఎగ్గొట్టిన దినాలలో ఏటిలో చేపలు పడుతున్నప్పుడు, తోటలో బీడీలు కాలుస్తున్నప్పుడు తనకు బాసటగా నిలిచిన ప్రియనేస్తం, స్కూలు ఫీజుకి డబ్బులు తక్కువొస్తే తండ్రికి తెలియకుండా దొంగదారిన సంతలో మేకపిల్లను అమ్మి తనకు డబ్బులు సర్ది తండ్రిచేత వాపుదెబ్బలు తిన్నా నిజం చెప్పని అమాయక నిరక్షరాస్యుడు. చెలిమి కలిమికి ప్రాణాలొడ్డే ధీరుడు గొల్లమల్లన్న-

"ఒరేయ్ మల్లా!" సుదర్శనం వేసిన గావుకేక రైలుకూతలో కలిసిపోయింది. తన చిన్ననాటి ప్రియనేస్తుణ్ణి తనివితీరా కౌగిలించుకుని కన్నీళ్లతో అభిషేకించాలనుకున్న సుదర్శనం రైలు గుమ్మం దగ్గరకు పరుగెత్తుకొచ్చేసరికి రైలువేగం పుంజుకుంది.

చిట్లిన గుండె నెత్తురు సుదర్శనం కళ్ళ నుండి చుక్కచుక్కలుగా రాలి పడుతున్నాయి.

* * *

వేల అడుగుల ఎత్తునుండి జారిపడుతున్న ఈ వ్యవస్థ జలపాతం కింద రాళ్ళ-జీవితాలు, ఏ క్షణాన ఏ రూపం దాల్చినా, గులకరాళ్ళుగా మారి చివరికి ఇసుకరేణువులుకాక ఎన్ని మిగులుతాయి!